# అంతరాత్మ

ప్ర ద కె ం అ

# అంతరాత్మ

సాయం సమయం; క్రుంగిపోతున్న దినకరుని యెర్రని చూపు.... యింటిముందు తోటలో వాలు కుర్చీమీద ఒంటరిగా కూర్చున్న డాక్టరు కోదండరామయ్యమీద పడుతూనే మాయమైంది. వీచేచిరుగాలి పాటకి, హోరెత్తే అలల వాద్యానికీ, పూలగుత్తులతో వున్న చెట్లు తల లూపుతుంటే డాక్టరుతల సంతోషంగా వూగింది. తలెత్తిన ముఖానికిఆకాశం అగుపించింది. ఆ వినీలాకాశంలో అక్కడక్కడా చెదరి చెదరి ముక్కలుముక్కలుగా సంచరించే తెల్లని మేఘాలను చూచి మోదంతో ముగ్ధుడవుతున్నాడు! అమ్మయ్యా! తీరుబడి యెరుగని జీవితానికి కోరుకున్న ప్రదేశంలో విశ్రాంతి ఈవేళనుంచే మొదలైంది! ఇంత చక్కని యిల్లు... యింటి చుట్టూ మోదాన్ని గొల్పే ప్రదేశం... హాయినిచ్చే కమ్మని వాతావరణం... ఇవన్నీ తను యీవయసులో కూడా ఆనందించ గలుగుతున్నాడే... తనలో యౌవన రక్తపుచాయలు సమసిపోలేదు. ఆనందంతో వుబ్బుతూ తనెంత అదృష్టవంతుడనని అనుకోకుండా వుండలేకపోయాడు.

చీకటి కొద్ది కొద్దిగా వ్యాపిస్తోంది. తన హోదా, గౌరవమర్యాదలు, పేరుప్రతిష్టలు, తనకోరికలు కొనసాగిన వైనం, తన పిల్లల గొప్పతనం, చివరకు తన చెక్కుచెదరని ఆరోగ్యం... అంతా నెమరువేసుకొని మురిసి పోతున్నాడు! ఈ ఆత్మామోదంలో ఒక తలపు తన ఆలోచనలకి కొద్దిగా అంతరాయం కలిగింది. తనభార్యసంగతి... ఆత్మలో ఆత్మగా మెసలింది. తను యెంతంటే అంత!... ఆమె చనిపోయిన లోటు యిదివరకు తనకు అగుపించక పోయినా... ఆమె యిప్పట్లో వుంటే యెంత బాగుండేది? రాను రాను ఆమె గురించి ఆలోచనలతో మెదడు నిండిపోయింది. తను యిన్నాళ్ళూ భార్యగురించి పలవరించకుండా యెలా వుండ గలిగాడు?... చాలాసేపటివరకూ తనమీద తనే విసుక్కు న్నాడు... ఆమె ఆరోగ్యం బాగా లేనప్పుడు స్థలం మార్చ వలిసిగది, మెడ్రాసులోవున్న స్పెషలిష్టుకు చూపించవలసింది! ... లేక బొంబాయి తీసుకవెళ్ళి వుంటే బ్రతికేదేమో?! అప్పుడు తీసుకొన్న శ్రమ, జాగ్రత్త చాలా తక్కువనిపిం చింది. ఈవిషయం అంతా తను ఇదివరకు యెందు కాలో చించలేదు? భార్యకు అనారోగ్యంగా వున్నప్పుడైనా తనకు తటలేదే! అలా తట్టకపోవటానికి, చనిపోయాక పలకరించక పోవటానికి కారణమేమిటి? ఈవృత్తిలో మునిపోయి ఇలా ఆలోచించటానికే తీరుబడి లేకపోయిందే! తన జీవితంలో

యిదొక్కటే బాధ— మరే బాధలు నలుగురిలా తను అనుభ వించలేదు......... ఇక అనుభవించ ననిపించింది......... సృష్ట్యాదినుంచీ చావుబ్రతుకుల మయమైన మార్పులేని మానవచరిత్రను మరిచిపోయి ....... తను యేం చేసుంటే భార్య బ్రతికుండేదోనని యింకా యింకా ఆలోచిస్తున్నాడు.

ఈ ఆలోచనలు భార్యను ఒక్కసారి చూడాలనేకోర్కెను దారితీశాయి. లేచాడు......ముందు గదిలో తనూ భార్య కలసి తీయించుకొన్న ఫోటోముందు నిల్చున్నాడు. నిల్చునే తదేకదృష్టితో మనసు లగ్నంచేసి చూస్తూంటే...... ఆమె ఒంటిని సొంపుగాఉన్న నగలు... ఆ ఆరువందల రూపాయల పట్టుచీర... ఆ నవ్వుముఖం... నవ్వుతూ వెక్కిరించినట్లు... వెక్కిరిస్తూ యేదో ప్రశ్నించినట్లయింది... ఆ ప్రశ్న తన శరీరమంతటినీ మలేరియాజ్వరం వచ్చినట్లు చేసింది!... నిద్రలో పీడకల గాంచిన మనిషికి తెలివివచ్చినట్లయి... అబ్బె—అబ్బె... అనుకొని అక్కడనుంచి బయటకువచ్చాడు. అంతా చీకటిగా వుంది. క్షణంక్రితం అందంగా కనిపించిన మేఘాలు, ఇప్పుడు అందమైన నక్షత్రాలను ఆకాశంలో కప్పేశాయి ! సాయం సమయపు అరుణరేఖల్లో అల్లాడిపోయినతరంగాలు భీభత్సంగా, నిశిలో హోరెత్తుతున్నాయ్. అందమైన ప్రకృతి మశిపులముకుని భూతంలా భయపెడుతున్నట్లనిపించింది! మళ్ళీధైర్యం తెచ్చు కోడానికి ప్రయత్నింస్తూంటే పిరికి తనం హెచ్చవుతోంది ! తన

భార్య తనను వెక్కిరించలేదే! ! ఏమీ అనలేదే! తనకే ఆ తలపు వచ్చివుంటుంది! తనలా సంస్కారం చదువూ వున్నవాడికి ఇలాంటి పిచ్చి ఆలోచన లేమిటి? పోనీ ఆ బంగారం కనీసం శృంగారంతో వున్న న్నాళ్ళయినా అనుభవించలేదా? ఏమి తీసుకపోయానని తన భార్య ఎలా అనగలగుతుంది? అది భ్రమ! తనే అలా అనుకున్నాడు! తనెందుకలా అనుకోవాలి? అయినా యిన్నాళ్లు లేనిది యిలాంటప్పుడు యీ ఆలోచన ఎందుకు రావలి, వట్టి పిరికివాడ నయ్యాననుకుని వెళ్ళిమళ్ళీ ఫోటోముందు నిల్చున్నాడు. చూసాడు! కన్నెర్రచేసిచూశాడు. కాని మనసు బతుకు బితుకుమన్నట్లు తోచింది. ఆ బితుకుతో పాటు తనకు యిదివరకెన్నడూలేని అదొక విధమైన బెదురు కలిగి, తను లేని ధైర్యం తెచ్చుకుంటున్నానని యెవరో ఎత్తి పొడిచినట్లనిపించింది... బయటకువచ్చాడు... ఆప్రశ్న భార్య వేసిందికాదు... తనలోనుంచి వచ్చింది. ప్రకృతి నలుమూలల నుంచీ ఆ ప్రశ్నే ప్రతిధ్వనించి నట్లనిపించి కంపించిపోయాడు. "నేనామెతో చేరనంటే చేరను" అనుకోవాలని ప్రయత్నించినా తనలోని జ్ఞానం 'తప్పకుండా చేరి తీరుతా' వని డమరుకంలా డమడమ లాడుతోంది!...

ఎలాగో భోజనం చేశాక ఆ గడచిన నిముషాలన్నీ తమాషాగా వున్నాయే అనుకున్నాడు. కుళ్ళినశవాలను కూడా కోసిన తను, ఆగడియల్లో చిన్న పిల్లాడిలా బెంగపడిపోయానని,

ఆ క్షణికమైన అధైర్యం, మళ్ళీ పొరపాటునైనా రాకూడదని మనసు దిట్టం చేసుకొన్నాడు. నిద్రపోయేవరకు వాకిట కుర్చీలో కూర్చున్నా ఆ తలపే రాలేదుగానీ మంచంమీద నడుంవాల్చగానే, నరాల్లోబలంలేని మనిషిలా, అదోలా అయి పోతున్నట్లనిపించింది.

“భార్య......ఫోటో...తన డబ్బు.... మేడలు... ఈ భవనం... ఆకాశం... భూమి... భూతం... కుర్చీ... పరుపు... పరుపుమీద తలగడ... తలగడమీద తనతల... తలమీద వెంట్రుకలు... వాసననూనె వ్రాసే యీ వెంట్రుకలకే నిప్పంటిస్తారే!”... నిర్దిష్టత లేని ఆలోచనలన్నీ వ్యాపిస్తూంటే ఛా, ఛా అనుకొన్నాడు. అంతటి ధైర్యశాలికి యిలాంటి ఆలోచనలు ఎప్పుడైనా వస్తాయని కలలోనైనా అనుకొన్నాడా? పడుకోవటానికి ప్రయత్నించాడు..: ఆప్రయత్నంలో పడుకుంటూనే మధ్య మధ్య తెలివి వచ్చేసేది— ఆలోచించేవాడు... వ్యర్థమైన ఆలోచనలని— మళ్ళీ పడుకోవడానికి ప్రయత్నం... ఇలా తెల్లవారి పోయింది....మళ్ళీ ధైర్యం... నిరుత్సాహం... ఏవో తలపులు.

మిట్ట మధ్యాహ్నం. మంచి నిద్రతీశాడు. లేచేసరికిదాహం వేసింది నిద్రలోఏవో కలలు సరిగా—జ్ఞాపకంరాలేదు జ్ఞాపకంచేసుకోడానికి ప్రయత్నించలేదు.నీరుతాగుతూంటే యే పదేళ్లనాడో ఎవడో పల్లెటూరువాడు ఉపయోగించిన “దాహం” అన్న

పదం మెదడులో యేమారుమూలల్లో దాగున్నదో, యీ క్షణానికి తలపుకు వచ్చింది. నీరు సగం తాగి ఆగిపోయాడు. ఆ మనిషి— ఆ మాటలు— ఆ సన్నివేశం— అంతా కళ్ళెదుట వుంది... "అబ్బా! ఈ డాక్టేరికి వల్లమాలిన దాహం. ఇంకో డాక్టేరి దగ్గరికి పోదాం!". అప్పుడు యిలాంటి వెధవలు రాకపోతేనేం అనుకొన్నాడు. ఆ మాటలే యిప్పుడు మరోలా అర్థం యిస్తున్నయ్. అందులో యేదో సత్యం వుందని తన కెవరోనొక్కి చెప్తూతున్నట్లనిపించినది. ఈ కొత్తయింట్లో బలే ఆలోచన్లొస్తున్నయ్! ఫొటో చూసిరాత్రంతా నిద్రలేదు! దాహం వేస్తే నీరు తాగితే యీలాంటి ఆలోచనలు యెందుకు గావాలి! మనిషితన జీవితంలో తృష్ణ లేకుండా బ్రతకటంకంటే యింకో నేరం లేదు. సుఖజీవనంలో మంచి బ్రతుకు తెరువులో ఉన్నత శిఖరాలగురించి ఆలోచించి తను బ్రతికాడు...అలానే బ్రతకాలని నిర్ధారించాడు...తనకిప్పుడు లోటేంవుంది? లేనిపోని ఆలోచనలతో తనెందుకు గిజగిజ లాడుకోవాలి? ఈ నిమిషం నుంచీ తను మామూల్మనిషిననిఅనుకొన్నాడు.

మధ్యాహ్నం పడుకోవటంవల్ల రాత్రివేగం నిద్రరాలేదు. వార్తాపత్రిక తిరగవేస్తూ యెవరో లంచం తిన్న ఆఫీసరుమీద వేసిన నేరం న్యాయమూర్తి యెదుట విచారణ అయ్యే వార్త చదువుతూనే ఆపేశాడు. ఆ ఆఫీసరు తనవంటివాడని స్ఫురించి నట్లయింది. తనువేరే అని అనుకొందా మనుకొన్నా...కోర్టు...

ప్రజ...న్యాయవాది.... న్యాయమూర్తి.... అంతా కళ్ళకు కట్టోంది. ఇదంతాయేమి టనుకొన్నాడు! కోర్టు లెందుకుండాలి? న్యాయవాదులు-న్యాయమూర్తి యెందుకు? తనలాంటివారున్నారనా? తనుప్రజలను దోచడా? అన్యాయం చేశాడా? న్యాయం ఏమిటి? అన్యాయమేమిటి?...డబ్బు గడించి సుఖంగా బ్రతకటం ఒకరిని దోచట మెలా అవుతుంది? ఆర్జించిన డబ్బుతోనూ ఉన్నదిట్టమైన శరీరంతోనూ, యిప్పుడు విశ్రాంతితో హాయిగా బ్రతకాలనేకదా, యాభై వేలిచ్చి యింత చక్కని ప్రదేశంలో యింతభవనం కట్టించాడు...ఇలాంటప్పుడు, న్యాయాన్యాయ విచారణ తనకెందుకు కనిపించింది_ మొదట తనకెందుకు లేక పోవాలి_మళ్ళీ తనేమీ అన్యాయం చెయ్యలేదే అని అనుకో బోయాడు_ అన్యాయం అన్నపదం మళ్ళీమళ్ళీతనను బల్లేల్లా చుట్టు ముట్టేస్తోంటే_దాసోహం అన్నట్లనిపించింది! కుష్టురోగంతో గింజుకొనేవాళ్ళూ...పక్షవాతంతో బాధపడ్డవాళ్ళూ ...పురుగులు పడ్డవాళ్ళూ...రక్తం కక్కేవాళ్ళు......యిలా యెందరిదగ్గరో డబ్బు వందలు పుచ్చుకొని మందులిచ్చాడు... వాళ్ళగురించి అప్పుడులేనిది... యిప్పుడే ఎందుకు తలపుకు రావాలి? వారి వంద లెలా యివ్వగలిగారు? వారూదోచారా? ...దోచబట్టేనా అంతహీనంగా వచ్చారు? యింత పేరుపడ్డ ఘనవైద్యుడైన తనూ వాళ్ళకేమీ సహాయం చెయ్యలేక పోయాడే! మనిషిచేతుల్లో లేనిది ఏదో వుండితీరాలి! లేకపోతే

తన భార్య ఎందుకు చావాలి? పోనీ చచ్చాక సుఖంగా శాంతంగా కాలం వెళ్ళబుచ్చుతానంటే తనమీాద ఎందుకీప్రశ్న లవర్షం కురిపించాలి?... తన భార్య కురిపించలేదే! తన మనసే అనవసరంగా వికలం అవుతోంది...ఐనా తను చేసిన అన్యాయం ఏంవుంది? విరామంలేకుండా పనిచేశాడు—దాని ప్రతిఫలం పుచ్చుకొన్నాడు......ఇందులో తప్పేముంది? అన్యాయం ఏముంది ? యింత సమర్థించుకోవటం దేనికనిపించింది ! న్యాయాన్యాయాలు మానవకల్పితాలు...అవి కష్టపడేవాడు సుఖపడే వాడిని చూసి ఓర్వలేక కల్పించిన వీ మాటలు. బ్రతికినన్నాళ్ళూ భోగలాలసలతో బ్రతకాలి. దరిద్రింతో అటమటించిపోవటం దేనికి. నలుగురూ యిలానే తలుస్తారా? వాళ్ళతో తనకేమిటిపని. తన తలపుతనది. .. తనెందుకు, అనవసరంగా, మనుష్యులు. . .జీవితాలు యీతర్కంలోనికిదిగటం . . .ఆలోచించటం మానే ప్రయత్నంలో హోరుమనిపిస్తున్న సముద్రపు ధ్వని వినిపిస్తోంది...సముద్రం . . .కెరటాలు... ఆటు— పోటు. . .తుపానులు . . .మనుష్యులు...మానవసముద్రంలో తనొక నీటిబిందువు . . .తను మిగతా నీటినుండి వేరు పడలేదు. . . ఆ నీటిలోనే కలసిన తనొక బిందువు . . .నీటితో కలిసివుంటేనే తనమనుగడ . . .బిందువుగా బయటకు వస్తే రాలిపోతుంది. దిగువనున్న యిసుకలో నామరూపాలు లేకుండా యింకిపోతుంది. తనూ అంతే అనిపించింది . . మను

షులతో వుండాలి . . . . . మనుషుల గురించి ఆలోచించాలి . . . .వాళ్ళ కష్టసుఖాలు పంచుకొని వాళ్ళతో వుండాలి. వాళ్ళు ఆలోచించినట్లు తనూ ఆలోచించాలి. లేకపోతే తనకు మనుగడలేదు . . .న్యాయాన్యాయా లున్నాయ్ . . . .మానవ కల్పితాలైనా మానవుని మనుగడకి అవి వుండితీరాలి!. . . . అయితే . . .

తను అన్యాయంగా ప్రవర్తించాడా?—తనలో పెద్ద ప్రశ్న రేగింది. . .?

దీపం ఆర్పి చిన్నదీపం వెలిగించాడు. ఉన్న ఒక్క నౌఖరు గాఢమైన నిద్రలో ఉన్నాడు. వాడెందుకు అంతహాయిగా పడుకోవాలి? తనకెందుకు నరాలు పీకినట్లయి నిద్దర రాకపోవాలి? దానికి కారణం తనకు తెలుసుననిపించింది! వాలుకుర్చీమీద చారబడి తన గడిచిన రోజులను సినీమాలా చూస్తున్నట్లుంది.

పేరుపడ్డ డాక్టరు జీవితంతో కథ మొదలు. బొంబాయి ఆసుపత్రిలో డాక్టరుగా వున్నప్పుడు:—నిశిరాత్రి—ఒక పల్లెటూరిమనిషి—డాక్టరింటి తలుపుమీదబడి పేదవాడ్నని, ఉన్న ఒకేకొడుకుని రక్షించమని గగ్గోలు పెట్టుంటాడు. యెంత ప్రాధేయపడినా—బొమ్మని గనుక్లేకాదు— గెంటించి వేస్తాడు. . .ఆ మనిషి తలబాదుకుంటాడు. . . కేకలు వేస్తాడు . . .డాక్టరు తలుపు బిడాయిస్తాడు. . .ఆ రెండోరోజు ఆ మనిషే మళ్ళీవస్తాడు. . .ఈసారి తన బంగళాచుట్టు తిరిగి పక

పకా నవ్వుతాడు...మళ్ళీ ఆ క్షణంలోనే అంతులేని ఆవేదనను సూచించే గగ్గోలు...త్రోసివాంటే పోయేవారు యీ పిచ్చి వాణ్ని చూచి కనికరించారు...డాక్టరు ఒక్క క్షణం అప్పుడు ఆలోచించినా, యీలాంటివాళ్ళు తన కెందరో?

పెద్ద ఆసుపత్రిలో ఒక వార్డుకు పెద్దగా వున్నప్పుడు–డబ్బుపుచ్చుకుని వెనుకవచ్చి తక్కువబాధపడే శ్రీమంతులను ఆసుపత్రిలో చేర్చుకొని, మొదటినుంచి కాసుకు కూర్చుని హెచ్చుబాధపడే పేదలకు పంగనామాలు పెట్టాడు.

ఒక కుర్రాడు...డాక్టరుని చూచే గజగజలాడిపోతున్నాడు...ఈ డాక్టరు తప్ప మరెవరు బ్రతికించలేరని నమ్మకం వుంది. ఈ డాక్టరు గసుర్లకు, ఆ కుర్రాడు జడిసిపోయాడు...యింకోడాక్టరు దగ్గరకువెళ్ళి కొద్దికాలంలో యెందుకు చచ్చిపోయాడో తనకు తెలుసు.

పాతికరూపాయల కన్సల్టేషను ఫీజు యెన్నివందలమంది దగ్గర పుచ్చుకున్నాడు. అలా యిచ్చుకోలేనివాళ్ళని యెందర్ని పంపించలేదు. ఒకొక్కటి యిలా కొల్లలుగా కళ్ళెదుట డాక్టరుగా తను చేసిన పనులు కనిపిస్తున్నయ్. అవి ఆపాలని తను ప్రయత్నించలేదు.–ఆపినా ఆగవని తనకు తెలుసు!

అప్పుడే రాత్రి రెండుగంటలు దాటింది. తను తనను గురించి యింతవరకూ చూసిన ఆ బొమ్మలకు తనలోని ధ్వని ప్రతిధ్వనించుతూ తనలో యిదివరకు రేగిన పెద్దప్రశ్నకు సమా

ధ్యానం యిస్తున్నట్లుంది. మంచంమీద చారబడ్డాడు. మనసేదో దహించుకు పోతున్నట్లనిపించింది. బోర్లపడుకుని..."ఆ కుర్రి వాడు చావడానికి, ఆ తండ్రి పిచ్చివాడవటానికి...కారకుడు నేనే?" అనుకొన్నాడు. మళ్ళీ మనసంతా మహాసముద్రం అయినట్లనిపించింది. ఆ గగ్గోలుతో "అమ్మో నేనెంత పాడు పని చేశాను. నా నిద్రకు భంగమని వాడిని పంపేశాను. గట్లు పుట్టలు దాటి నేనెళ్ళి ఆ కుర్రవాడికి మందిస్తే—చచ్చినా—వాడు తృప్తితో వుండి పిచ్చివాడు కాకపోను. నాకూ ఒక్కడే కొడుకుకదా! నేనే వాడి పరిస్థితిలో వుంటే! ఆ రాత్రి మీద వాడే ఒక వందరూపాయలు పారేస్తే ఆర్థికస్థోమత గలవాడై యుంటే—పరిగెత్తే వాడినే!... నేను డబ్బును చూసుకొనేనా బ్రతికాను... మానవసమాజానికి సేవకుడైన డాక్టరుకు రాత్రి పగలూ ఒకటే!"

"ఎందరు పేదవాళ్ళు నేనువేగంగా ఆసుపత్రిలో చేర్చకపోవటంవల్ల చచ్చిపోయారు? ఆ కుర్రాడిని ఆ డాక్టరు చేతకాక చంపేశాడే! దయాధర్మాలు లేక బతికానని... యివన్నీ అప్పుడు నేను యెందుకు ఆలోచించలేదు పొరపాటు నైనా నా కెందుకీ ఆలోచనలు రాకపోవాలి...నేను గుడ్డి వాడనయ్యానా? నా ధనాపేక్ష నన్ను గుడ్డివాణ్ణిగా చేసిందా? ...యింత గుండె లేకుండా నే నెలా బ్రతికాను..." డాక్టరు కళ్ళలో నీరు తిరిగినట్లయింది. దొంతరలుగా ఆలోచనలు రేగి

తనను మరింత కలవరపెట్టసాగాయ్. తెలతెలవారినా యింకా కుమిలిపోతున్నాడు. మొదట యీ ఆలోచన లేమిటని బాధ పడినా, తరువాత తనలో యేదో మనోవికాసం కలుగుతోం దని...తనకీ మనోవికాసం యిదివర కెందుకు కలగకపోవాలి? ...ఆ వికాసం చనిపోయిన తన భార్య కలుగజేస్తోందా?... లేక కష్టపడే పేదజనావళిగురించి తను ఆలోచించటం మొదలు పెట్టడం వల్ల కలుగుతోందా?

తెల్లవారిపోయింది! ఆ వెలుగు తనలోనే వున్నట్లనిపిం చింది. స్నానం కాఫీఅయ్యాక తోటలోయిటూఅటూపచారు చేశాడు...భవనంవేపు చూసాక...యాభై వేలు తన జీవితం మీద గడింపగలిగే వాడా? తను పొందిన సుఖం మర్యాదలు ఒక్కొక్కటే జ్ఞప్తికి రాసాగాయ్ పదివేలు కట్నం ఇచ్చి తన కూతురును ఒక యింజనీరు భార్యను చేశాడంటే ...బేంకులో యాభై వేలవరకూ వుంచి మెడికల్ సర్వీసు డైరక్టరుతో వియ్యంపొందాడంటే తక్కువ విషయమా? తను జీతంమీదనే ఆధారపడివుంటే ఒక గుడెసెలో నివసించవలసిం దీసరికి..... లోకంలో నిజంగా దోచేవాళ్ళెందరు లేరు. తన కళ్ళెదుట మామ్మూలు వర్తకు లెందరు కోటీశ్వరులు కాలేదు. ఎందరు ప్రభుత్వోద్యోగులు మేడ మిద్దెలు కట్టించి పెళ్ళాలపేరవ్రాయి లేదు. పెద్దపట్టణాల్లో, పైదేశాల్లో డాక్టర్లు తనకంటెచాలా హెచ్చు డబ్బు పుచ్చుకుంటూరే?...వాళ్ళతో సరిపోలిస్తే తను

గడించిన దేమాత్రిం!... తను చేసిన అన్యాయం యేముంది? తనే యింత గిజగిజలాడిపోతే వాళ్ళెలా గిజగిజలాడిచావాలి? తను బాధపడే అవసరం లేదనుకున్నాడు.

రాత్రింతా మేల్కొని వుండడంవల్ల మధ్యాహ్నంకంటి రెప్పలు బరువెక్కిపోతున్నాయ్. పడుకుంటే మళ్ళీ యేవో ఆలోచనలు వచ్చి రాత్రికి నిద్రపట్టదని చేతికందిన పుస్తకాన్ని బీరువా సించి తీశాడు... పేజీ తిప్పగానే అగుపించింది—

"మనిషిలోని ఉద్రిక్తత ఆత్మని గుడ్డిదాన్నిగా చేసి తనలోవున్న జ్ఞానం యేం పనైతే చెయ్యనిచ్చేదికాదో-ఆ పనినే చేయిస్తుంది. ఎప్పుడైతే ఆ జ్ఞానం తిరిగివస్తుందో— ఆ వ్యక్తి తన తప్పులను తెలుసుకుని పశ్చాత్తాపపడతాడు."

పుస్తకను మూసి పరుపుమీదకు విసిరేశాడు. ఈ పుస్తకం తనదగ్గర యెన్నాళ్ళనుంచో వుంది. కానీ తను యీ మాటలు యిదివరకు చూచినట్లు లేదు— చూచినా యిప్పటిలా అర్థంచేసుకొని ఆలోచించినట్లులేదు. గడచిన రాత్రిలా మనసు ఆలోచించ మొదలు పెట్టూంటే, ఆపి తన సౌఖ్యం హోదా తలుచుకొని మనస్సు తిప్పాలని ఉబలాటపడ్తున్నాడు...ఈ ప్రయత్నంలో...మేడలు మిద్దెలు...దర్జాగా—ఒకరి ఖాతరు లేకుండా, ఒకరికి లొంగకుండా— బ్రతికాడే?...అలాంటి తను, చిన్నపిల్లాడిలా...మామూలు బజారు మనిషిలా.నిమిష నిమిషానికియిలా కావడందేనికి? గడిచిన సౌఖ్యాలు తలుచుకోవాలని

విశ్వప్రయత్నం చేస్తూంటె—అవి మనసుకు సరిగ్గాఅందటంలేదు ...అందినా యెంతోసేపు నిలవటంలేదు...ఈ ఉక్కిరి బిక్కిరిలోయెవరో దూరంనించి యేదో పెద్దప్రశ్నతో దగ్గరకువస్తున్నట్లనిపించింది. ఆ ప్రశ్న యిప్పుడు ఒళ్ళంతా జరజరా ప్రాకిపోయింది! "నువ్వు నీసుఖాలని జ్ఞాపకంచేసుకొని ఆనందించగలవూ?" ఎవరీ ప్రశ్న వేస్తున్నారు? తనే! తనెందుకీప్రశ్న వేసుకోవాలి?

డాక్టరు అలా పరుపుమీద చారబడిపోయాడు. ఇన్నాళ్ళు తను గుడ్డివాడనయ్యానని, తన జ్ఞానం తిరిగివచ్చిందనీ, అంచేతనే తనిలా తికమకపడ్తున్నానని, అనుకున్నాడు. ఒక కౌపీనధారి గతిస్తే చిన్న పిల్లలనుంచీ ముసలివాళ్ళవరకు యెందరేడ్చారో— ఒక కోటీశ్వరుడు చస్తే వాళ్ళపిల్లలు కోర్టుకెందుకెక్కారో, తన కిప్పుడు తెలుసుననిపించింది. పైదేశాల డాక్టరుకూ యీ దేశాల డాక్టరుకూ పోల్చటం తప్పని... ఈ మన పెద్ద పేదదేశంలో ఆశలకుహద్దులుంచుకొని, పేదలపై ఉన్నతవర్గాలవారు కనికరం చూపించకపోతే, దేశమే లేదనిపించింది...తన సౌఖ్యమయ జీవితం... ఆ ఘటాలు...అవన్నీ జ్ఞాపకం... నీటిబుడగలు. అంతే; శమదమాదులు, కష్టాలు— అన్నీ మనసులో హత్తుకొని మనిషిని మూసలోపోసిన బంగారంలా చేస్తాయ్; పురాణాలు శాస్త్రాలు అన్నీ తోడి మానవునిమీద ప్రేమాభిమానాలే చాటాయిగానీ యింకేమీ

లేదు. ఈ పరమసత్యాన్ని తను గుర్తించినవాడై గ్రహించక నిర్ద యుడై బ్రతికానని కుమిలిపోతూనే శెప్పవాల్చాడు.

గడియారం మామూలుగానే నడుస్తోంది. ఐదుగంటలు కొట్టేటప్పుడు అలా కళ్ళప్పచెప్పి దానివేపే చూస్తున్నాడు. అది అయిదు గంటలప్పుడు ఆరుగంటలు ఎందుకు కొట్టకూడదు? దీనిగురించి చాలా సేపు తర్కించుకొన్నాక, యింతసేపూ తను అనవసరవిషయంగురించి అర్థంలేకండా ఆలోచించానని పరుపు మీదనుంచి లేచిపోయాడు. ఆ నిమిషంనించీ తెలివివున్నపుడల్లా యేదో ఆలోచన వుండనే వుంటోంది. .నిద్రలోనూ ఆలో చనలు వున్నాయని తనకురోజూ వచ్చేకలలేచెప్పుతున్నాయ్... గడియారం గంటలు కొట్టోంది... అలా రోజులు గడిచి పోతున్నాయ్... గడియారంలా తన బ్రతుకూ యే గొడవా ఆలోచనాలేకుండా, ఒక తోవలో తిరిగివుంటే బావుండే దని పించింది. కాని మళ్ళీ తిప్పుకున్నాడు; అలావుంటే; యింత డబ్బు, గడించేవాడు కాదని, ఈ ఆలోచనలకు తావుండేది కాదని తోచింది మనిషికి మెద డుంది—గడియారానికి అదిలేదు—మెదడున్న వాడిచే సృష్టింపబడిందది— మెదడున్నవాడిసి సృష్టించినావాడెంతవాడో?

ఒక రోజు గదిలో కూర్చుని, భార్య ఫోటోవేపు చూస్తూ వేగం చచ్చిపోవటంలో, ఆమె అదృష్టవంతురాలను కున్నాడు. చావుగురించి, తలపులు మళ్ళీతనను కలవరపరచాయి

తోటలోకి వెళ్ళాడు. చుట్టూ పచారుచేస్తూవుంటే పచ్చని గరిక కనిపించింది. అది ఎందుకు పచ్చగా ఉండాలి? గొడ్లు తినిపుష్టిగా ఉండటానికి. గరికి తిన్నగొడ్లు చస్తాయిగానీ గరికి చావదే— చావు— ఎందుకు తనకీ ఆలోచనలు? రాత్రినక, పగనలక, విరామంలేకుండా అసంఖ్యాకంగా, తనను అంటి పెట్టుకోని, పాడైపోయిన కాలేయం మనిషిని అల్లరిపెట్టినట్లుగా చేస్తూన్నాయ్. ఇవన్నీ తనిలాకూర్చుని తినటంవల్ల వస్తు న్నాయని స్వంతంగా ఒక ఆసుపత్రి పెడదామనుకున్నాడు. దానికిశరీర శక్తిలేదనిపించింది. మళ్ళీడబ్బు జబ్బులగొడవల్లోపడి తనకు విశ్రాంతివుండదు— తన ఆరోగ్యం పాడవుతుంది... అవును ఆరోగ్యం పాడవుతే... మనిషి చచ్చిపోతాడు!— హడిలిపోయాడు.

రోజులు— నెలలు గడిచిపోతున్నయ్. తనుఆలోచనల ఊబిలో దిగబడిపోయానని— విమోచనమార్గమేమిటనిరాత్రిం పగళ్ళు ఆలోచిస్తూన్నాడు. తను పొ దిన సుఖమంతా— యిప్పుడు పొందుతున్నఆరాటంలో యెన్నో వంతనిపించింది. నరాలన్నీ తోడుకపోతున్నాయని— గుండె దడపట్టుకుంటోం దని, అనుకోకుండానే స్ఫురించింది. తను యేంచెయ్యడానికి వెళ్ళినా యెవరో అడ్డుపెట్తున్న ట్లనిపించిచింది. యెవరో అజ్ఞాతుడైన పోలీసు— తనలోనే దాగొని వున్నాడనిపించింది. ఇన్నాళ్ళూ లేనిది యిప్పుడే వీడు లాఠీపట్టుకొని బాదాలా?—

ఒక్కొక్కనాడు మనసు వికలమయ్యేది. ఏదో చేసేద్దామని ఉబలాట పడేవాడు. దానధర్మాలు చేద్దామనుకొంటే— యేంలాభం యిప్పుడు?— తీర్థయాత్రలు సేవిద్దామనుకొన్నాడు— యేంలాభం?... కష్టపడేవాళ్ళకు కొంత డబ్బు పారేద్దాం! యేంలాభం? చేసిన పాపాలను యీ లంచాలతో తుడిచిపెట్టేద్దామనుకొన్నావా? ఈ ప్రశ్నలను తనలో వుండే వేస్తున్నాడెవరో— యెదరగా పిల్లిలా నక్కిపోతున్నాడు!

రానురాను తన ఆలోచనలు, భయంమీద తప్ప దేనిమీదా కేంద్రీకరించలేక పోతున్నాడు. అంతా బూటకంలా కనిపిస్తోంది. బయటకు వెళ్దామంటే బుద్ధిపుట్టటంలేదు. ఏదోభయం. కారు డ్రైవు చేస్తుంటే మనుష్యులను తొక్కించి తనూ చచ్చిపోతాడేమోనన్న పిరికి పుట్టోంది. ఇల్లు కదలటం మానివేశాడు. ఒకనాటి సాయంకాలం మబ్బుగా వుంది. సముద్రంమీద వర్షం కురుస్తోంది. కొండంతయెత్తుకు కెరటాలు లేస్తున్నయ్. చల్లనిగాలి వుండివుండి వీస్తోంది. వరండాలో నిల్చుని సముద్రంవేపు చూస్తున్నాడు. ఒక చిన్న పడవ వర్షంవల్ల కెరటాల్లో చిక్కుకుని తిరగబడిపోతూన్నట్లనిపించింది...తనే ఆ పడవమీద వున్నట్లు—ఆ లోతునీట్లో పడి గిజగిజ గింజుకుపోతున్నట్లయి — కాళ్ళు—శరీరం—గజగజ లాడిపోతూంది... మునిగిపోతున్న వాడు చేతులెత్తి..."తండ్రీ రక్షించు—రక్షించు" అని అరచి గగ్గోలు పెట్టినట్లనిపించింది...

హృదయం కంపించిపోతూంది... తను మనసులోనే చేతు లెత్తుకున్నాడు. గట్టిగాయీమాటలనే మనసులోఅనుకొన్నాడు. కొంతసేపటికి గాని తను యిపంతా ప్రూహించుకొన్నాననే జ్ఞానంరాలేదు. తనకుయిదివరకు యిలాంటి అనుభూతి యెప్పుడూ రాలేదు. కష్టంలో వుండేవాడి పరిస్థితి యెలా వుంటుందో తన కిప్పుడుఅర్థం అయ్యింది. ఇలా కష్టంలోవున్నవాళ్ళు రక్షించమని తనదగ్గర కెందరొచ్చారు? అలాంటి వాళ్ళదగ్గర తను బేరా లాడాడు? డబ్బు కక్కసిది మందివ్వలేదు! తనవంటినిర్దయుడి కెందుకింత గొప్ప కళ దేవు డిచ్చా డనిపించింది. ఒకదమ్మిడీ పుచ్చుకోకండా, యేరాత్రిమీదైనా వాళ్ళని రక్షించడానికి పరుగెత్తవలసింది! ఇదే తలచుకొని చతికిలబడ్డాడు తలుచు కొన్నకొద్దీ గుండె ద్రవించుకపోతూంటే లోనించి పోలీసు లాఠీతో తెగబాదుతున్నాడు. చేయెత్తి "తండ్రీ! రక్షించు! రక్షించు" మనటానికి తనకు అర్హత లేదనిపించింది. దేవుని పేరెత్తాలనుకున్నా యెత్తలేక పరుపుమీద పడ్డాడు. ఒళ్ళంతా వుబ్బిపోతూన్నట్లు... అంతలోనే యేదో భయం...చిరాకు ...జాలి...యేడుపు కూడా వచ్చినట్లయింది.

చాలాసేపటికి గానీ మనస్సు మళ్ళీయథాస్థానంకురాలేదు. వచ్చాక గదిలో అటూ యిటూ, కొద్దిగా పచారు చేస్తూ వుంటే, యెదరగా అద్దంలో ముఖం కనిపించింది. మెర్క్యురీ లైటు గదిలో వెలుగుతూంది. బయట ముసురు చీకటిలో

ప్రారంభమైంది. ఒకటే ఘీంకారం...ఎక్కడో పొదచాటున వున్న ముదుసలి నక్క తడిసిపోయి— చలికి వణుకుతూ అరుస్తున్నట్లనిపించింది. అరుపు విని తనగురించి ఆలోచించటం మొదలు పెట్టాడు...నక్క— జిత్తులమారి...అందులో ముసిలి నక్క....తన పరిస్థితి అలానే వుందనుకున్నా— తరువాత అలా పోల్చుకోవటం దేనికనిపించింది.

అద్దం దగ్గరగా వెళ్ళాడు. ఇన్నాళ్ళనుంచీ వున్నఅద్దమే! ఇదివర కెన్నోసార్లు యీ అద్దంలో ముఖం చూసుకొని తృప్తి పొందాడు. ఇప్పుడు—ఆ ముఖం... ముఖంలో కళ్ళు... పెదాలు... చెవులు...మీసం...అన్నీ శుష్కించినట్లు—గబుక్కున తనెంత చిక్కిపోయాననుకున్నాడు— అక్కడనుంచి కదిలినా తను ఆలోచనలతోనే యెండిపోయానని—తనెందు కాలోచించాలని అనుకుంటూనే కుర్చీమీద కూర్చున్నాడు. హోరున వర్షం . . .ఉండి వుండి గాలిరివట వేస్తోంది. . . చలి వేస్తున్నట్లు—ఏదో కప్పుకోవా లనిపించింది నౌకరుని పిలవా లనుకుని లేచి వీధితలుపులు బిడాయించి వస్తూనే, మళ్ళీ అద్దంలో ముఖం చూడాలనిపించింది. వెళ్ళాడు. . .ఈ సారి ముఖమేకాదు....వక్షం....చేతులు... వేళ్ళు...వేళ్ళ చివరలు కూడా...అద్దంలో చూచుకొన్నాడు....చేతులు వేళ్ళు తనెందుకు అద్దంలో చూసుకోవాలి?....ఆ చర్మం...అంటిపెట్టుకొన్న మాంసం... మాంసంమధ్య...యెముకలు అద్దంలో

చూస్తుండగానే... తనముఖం....శరీరం అంతా అస్థిపంజరంలా అగుపించింది. ...ఇదివరకు యిలాంటి ఎముకలను తాకి, ఆపేరుకూడా చేశాడు...ఇప్పుడు చూస్తుంటే కెవ్వున కేకవేద్దామన్నంత భయం వేసింది...

ఆ గదిలో వుండలేక యింకో గదిలోకి వెళ్ళిపోయి, సోఫామీద చతికిలబడ్డాడు. తనెంతగా చిక్కిపోయాడు. బలం లేనిది తన బ్రతుకేమిటి?....ఈ ఆస్థిపాస్తు లన్నిటినీ విడిచి పెట్టాలా?—అంతా ఎముకల మయం...వీటి తాలూకు అంత్యం? ఈ విషయాలు తలుచుకోకుండా వుండాలని ప్రయత్నించాడు. ప్రయత్నించినకొలది వీటి విషయాలే తలుపుకొస్తున్నాయ్. ఆ రాత్రి భోజనంమీద కూడాలేదు. ఎక్కడకక్కడే ఆ ముఖం ...ఆ అస్థిపంజరం అగుపిస్తోంది....చెయ్యి చూసుకొంటే రక్తమాంసాలు లేనట్లు...అలా పరుపుమీద వాలుతూంటే ఒక అస్థిపంజరం కదులుతూ పరుపుమీద పడినట్లనిపిస్తోంది. తను యిదివరకు మెడికల్ కాలేజీలో చూసిన అస్థిపంజరాలన్నీ కదులుతున్నట్లు— కదులుతునే తనవేపు వస్తున్నట్లు...తను పిచ్చివాడుగా మారుతున్నట్లు అనుమానం, భయం వేసింది...ఎడతెగని ఆలోచనలతో భయం వేస్తుంటే—నౌకరుని, తన గదిలోనే పడుకోమన్నాడు. చారబడింది మొదలు వాడిది ఒకటే నిద్ర. చాలాసేపు గింజుకుంటున్నాడు తనిప్పుడు చచ్చిపోతున్నానేమో అనిపించింది. ఈ తలపులతో

ఒళ్ళు కంపించిపోయింది. లేచాడు....

వర్షం వెలిసింది. అంధకారంలో చుక్కల మినమిన వెలుగులో చెట్లు భూతాల్లా అగుపించాయి. తను చచ్చి భూత మవుతాడేమో ననిపించి—కిటికీదగ్గర నిల్చోడానికి భయంవేసింది—నిద్రపోదామనిప్రయత్నించాడు...అద్దం!— కాళ్ళ పీను—రెండు మైళ్ళుయెకాయెకి పరిగెత్తినంత ఆయాసం వచ్చింది. . . వేడెక్కిన తలను నీటితో తడిపాడు. ఎంతో సేపటికిగాని నిద్రరాలేదు... లేచేసరకి వచ్చిన కలలు సరిగా జ్ఞాపకంలేవు—అద్దం కలలో రావటంవల్ల జ్ఞాపకం చేసుకోవటానికి ప్రయత్నించాడు. నిజంగా తనకు కలలో అద్దం కనిపించింది—తను అద్దం ముందు నిల్చున్నాడు. తల అగపడలేదు కదూ? ... ఉత్తి మొండెం! నిజంగానే ? అమ్మో అనుకున్నాడు. కాదు అలా అగపడలేదు... అగపడిందేమో? పాడుకల... పీడకల... తనింకెంత కాలమో బ్రతకడు? తను చచ్చిపోతాడా ? నిజంగానే?... యింత వేగంగానే? ..."చచ్చిపోను... చచ్చిపోడానికి వీల్లేదు" అని అనుకోబోయాడు . . . . అద్దం! అమ్మో అద్దం! ఈసారి నిమిష నిమిషానికి పిరికితనం బలిసిపోతూంది. ఇంకే ఆలోచనకీ మనసులో తావులేదు . . . ఒక్కటే! చావు . . . చావు . . . ! నిమిషాలన్నీ కూడుకుని గంట లయ్యాయి. మనిషి కంపించిపోతున్నాడు . . . గంటలన్నీ కూడి రోజయ్యింది. మళ్లీ చీకటి . . . భయం . . .

నిద్దర పూర్తిగా తనను విడిచిపెట్టింది— నిద్రలేని రాత్రిలు అంతులేని ఆవేదనతో గడిచిపోయాయి . . . కొలవటానికి అందని ఆవేదన— బాధ! . . . పచ్చని ప్రకృతి యెండి పోతూంది! రక్తం గడ్డకట్టుక పోతూంది . . . ఆలోచనలతో తల పగిలి మెదడు చెల్లా చెదరయి పోతూంది . . .! అస్థిపంజరం యిదివరలా యింటిలోనైనా తిరగటానికి భయపడి మంచంపట్టింది !

టెలిగ్రాం అందుకున్న కొడుకూ కోడలూ వచ్చారు. తనంతవాడు— తన కంటేగొప్ప డాక్టరు —చూడగానే "యింతగా చిక్కిపోయేవరకూ కబురుచేశావు కాదేం నాన్నా" అంటే ఆ మాటల్లోనే తనరాతవుందని తోస్తోంది. మాట్లా డటానికి శక్తిరాలేదు. ఏవో మందులవిషయం కొడుకు ప్రయ త్నిస్తుంటే— ఆ మందులు తనకు పనిచెయ్యవని తోస్తోంది. మందులు వద్దని చెప్పటానికి సిగ్గుపడ్డాడు. తన మనోవ్యథ కొడుకుకి ప్రాకకూడదని తన వుద్దేశం! దగ్గరవుండి అన్ని సదుపాయాలు కొడుకు, కోడలు చేస్తున్నారు. మనోవ్యథ గట్టిమనిషిని కూడా చంపుతుందని తనకు తెలుసు. చావు భయం— ఆ ఆలోచనలతోపాటు యీ యిచ్చే మందుల మీద ఆలోచనలు కూడా తోడైనయ్. తను డాక్టరెందు కయ్యానని విసుగ్గున్నాడు. తనకు తెలుసుకాబట్టి యే మందు మీదా నమ్మకం కలగడంలేదు.

తన జబ్బుకు మందులేదని యేనాడో తెలుసుకున్నాడు. తన ఒకే ఒక కొడుకు కోడలు వగ్గర వున్నారని కొద్దిగా తృప్తి తప్పించి తనపరిస్థితి యేమీ మారలేదు. తను యేదో మనోవికాసం కలిగిందనుకున్నాక దానధర్మాలు చెయ్యటానికి యేదో సాకు పెట్టి తగ్గిపోయాడు. తన చేతులు పుచ్చుకోవట మేగాని యిచ్చి యెరగవు.— ఇదీ బ్రతుకేనా?— ఇలాంటి తలపులతో బాధపడి పరిస్థితిని మరీ అధ్వాన్నంగా చేసింది.

ఆవేళ ఆదివారం— రాత్రి పదకొండు గంటలు దాటి అయిదు నిమిషా లయింది— గడియారం వైపుచూశాడు. అది ఆగిపోతూం దనిపించింది. "కీ" యిమ్మని కొడుకుతో చెప్పాలనుకున్నాడు. అంతా గాఢంగా నిద్రపోతున్నారు. రక్తపోటు వచ్చిందని అనుమాన పడసాగాడు. కొడుకుని లేపాలని, మళ్ళీలేపినా ఆ పరిస్థితిలో అతను చేసేదేమీలేదని... ఆలోచనలు లేకుండా కాస్సేపు వుందామని ప్రయత్నించాడు. కానీ ఆ కొడుకుగురించే ఆలోచింపసాగాడు— తన కొడుకు— ఒకే ఒకకొడుకు మళ్ళీ యెదో మైకం కమ్మినట్లైయింది— కళ్ళలో రునీచిమ్ముతున్నట్లు ఆ నీరు మెల్లమెల్లగా కారుతున్నట్లు భ్రిమపడ్డాడు. "నా కొడుకు.... నాబాబు— నాలానే అన్యాయార్జనతో పెంచబడ్డాడు— పెద్దవాడయ్యాడు — పెద్ద డాక్టరయ్యాడు— నాలానే దోచేస్తున్నాడు—చివరికి నాగతే పట్టుంది— నాకంటే యెన్నిరెట్లు హెచ్చుగా బాధపట్తాడో?

అయ్యో తండ్రీ! నా ఒక్క గాని ఒక్క కొడుకు— నా లాంటిహీనమైన చావేచావాలా?" కళ్ళంటి యీసారి నిజంగా నీరువచ్చింది. ఆ బెడ్‌లైటు లేత వెలుగులో మళ్ళీమళ్ళీ కొడుకువైపు చూశాడు— తనిం కెంతసేపో బ్రితకడు— "ఈ నిమిషాల్లోనైనా నాముద్దుతండ్రివైపు చూస్తాను."— చూస్తున్నాడు. ఆవెలుగులానే తనలో మైకం కమ్మివేస్తోంది! తను చచ్చిపోతున్నాడు— నిజంగా చచ్చి పోతున్నాడు. "భగవంతుడా!" అని తల్చడానికి తను వెనుదీయలేదు. పురుగులుపడి చచ్చినవాళ్ళబాధ, తను యీ కొద్దినెలల్లోపడ్డ బాధతో పోలిస్తే యేమీకాదు. తనలా పురుగులుపడి చచ్చి పోయుంటే చాలా అదృష్టవంతుడనిపించింది. ఈ ఆలోచన లతో మళ్ళీ భయంవేసింది. చనిపోయేముందు మనిషి చేసే పాపాలు ప్రత్యక్షం మౌతాయట— కళ్ళు మూతలు పడిపోతున్నా—చెవులు ఖంగుమంటున్నాయ్. అన్యాయమెరు గని పాపడు— "నివ్వే నన్ను చంపేశావ్" అంటున్నాడు. అరుస్తున్నాడు డాక్టరు బెదిరి పోయాడు. ఆ పక్కనే పకపకా నవ్వుతున్నా డో పిచ్చివాడు. నవ్వుతూనే గొల్లుమని యేడుస్తూ"నా కొడుకుని చంపేశావ్! నువ్వే! నువ్వే "కన్నీరు ధారగా డాక్టరు కళ్ళలోంచి ప్రవహిస్తోంది! యింకా యిలా ఒకరుకాదు యిద్దరు కాదు... వందలకొలదీ బాధపడేవాళ్లు. ఆర్తనాదాలు... వెక్కిరింపులు... వికటాట్టహాసాలు ...

డాక్టరు చెవులు బ్రిద్దలై పోయాయ్— కళ్ళు పేలిపోయాయ్.. కెవ్వున కేక వేశాడు! తండ్రిచే కొట్టబడిన అల్లరి పిల్లాడిలా— తొమ్మిది నెలల నివాసమైన నరకకూపంనించి, వెలుగులో పడ్డ బిడ్డ అరుపువలె వుందది!

తెల్లవారిపోయింది— తెలివి వచ్చేసరికి— తనుయింకో ప్రదేశంలో వున్నానని... చుట్టూవున్న డాక్టర్లు నర్సులవేపు చూసి పోల్చుకున్నాడు. మాటాడటానికి కదలటానికి శక్తి లేదు... ఎదరగా వున్న కొడుకుతోనైనా మాటాడాలని ఆసక్తి కలగలేదు—

బ్రహ్మాండమైన నీరసంతో వున్నా మనసు ఆలోచించ గలిగే పరిస్థితిలో వుంది. ఎదురుగా వున్న స్పెషల్ వార్డు కిటికీ గుండా దూరాన్న పచ్చని చెట్లు కొండలు అగుపించాయి. పక్షులు యెగురుతున్నాయ్. పశువులకాపరి వేణువు నూదు తూంటే— మేస్తూన్న పశువులు తల లూపుతున్నట్లు— అంతా మనోహరంగా వూహించుకోసాగాడు. గోమాత తల పుతో తన తల్లి తలపుకొచ్చింది... ''నన్ను కనేటప్పుడు మా అమ్మ— అంత బాధ నొప్పులూ మంచికోసం పడింది. నేను జీవితంలో బాధపడలేదు... అంచేత మంచి చెయ్యలేక పోయాను. ఈ ప్రపంచంలో యే సుఖంకోసం అంతగా ప్రాకులాటపడి, అనుభవించానో అదిసుఖమే కాదు—డబ్బువల్ల సుఖంరాదు— మనిషి తనతోడిమానవులయెడ కనీసపుబాధ్యతలు

సక్రమం గానిర్వర్తించడంవల్ల నే, వస్తుందని తెలుసుకోలేక పోయాను—మనిషికి మనుష్యులే ధర్మం!"

డాక్టరు అందరివేపూ చూస్తున్నాడు తనకంటె అమానుషు లెందరో ఆ గుంపులో వున్నారని తెలిసినా—అందరూ మంచి మనుష్యులుగా అగుపిస్తున్నారు. వాళ్ళంతా యీ భూమాత బిడ్డలు— తోడి సోదరులు!— తనింకొక జన్మ మెత్తినట్లనిపించింది.

కొద్ది నిమిషాలలో నీరసం మరీ బాగా కమ్ముతూండటం వల్ల కళ్ళు మూశాడు. మూస్తూనే ఒక్కసారి తనగురించి తలుచుకోకుండా వుండలేక పోయాడు. యీ భూమిమీద పుట్టాడు— భూమి యిచ్చిన ఆహారపదార్థాలతో పెరిగాడు— ఆమె యిచ్చిన మందు మాకులతో యెందరి జబ్బులనో డబ్బు తిని బాగుచేసేడు యిప్పుడు ఆమెదగ్గరకు చెడ్డ బిడ్డడుగా వెళ్ళాలి? "నాతల్లి కెంత కనికరం?" అనుకున్నాడు. "నన్ను మంచిబిడ్డడిలానే తనలో కలుపుకుంటుంది" "నా తల్లీ!— నా బంగారు తల్లీ ! — నన్ను క్షమించమ్మా ! నే నెంత కృతఘ్నుడ్ని ? నాతో యిప్పుడు తీసుకపోయే దేముంది ? ఈ ఇలాతలంలో యెందరో నన్నుతల్చుకొని అసహ్యించుకొనే అపకీర్తి అట్టిపెట్టి వెళ్ళిపోతున్నాను. నాయీ ఎడతెగని దాహాన్ని నివ్వేనమ్మా తీర్చే గంగా జలానివి! అమ్మా! నన్ను క్షమించవూ?— క్షమించవా తల్లీ ! నీ పాదాలమీదపడి

మ్రొక్కుతాను— తల బాదుకుంటాను— హాయిగానీలో కలిసిపోతాను.”

ఎంతో ప్రయత్నంమీద మంచం మీద నుంచి జారుతూంటే— చుట్టూ వున్నవాళ్ళు ఆపేశారు. గుంజాటన పడుతూ ఆ మిగిలివున్న ఆఖరుశక్తితో గట్టిగా ఒక్క అరుపు అరచాడు “నాతల్లి పాదాలను ముద్దుపెట్టుకోనివ్వరూ?”

తలవేపు నిల్చొన్న కన్నకొడుకు కళ్ళలోంచి రాలిన రెండే రెండు బిందువులు ఆలోచనలు విరమించిన ఆ తలప్రక్కనే తలగడమీద పడి యింకిపోయాయి !

★